సాక్షి
తిరుపతి
బుధవారం । 13 । నవంబర్ । 2024



తుషారం.. ఆహ్లాద సమీరం

అసలే అందమైన శేషాచలం.. అపై వానాకాలం.. ఇంకేముంది..ఎటు చూసినా మేఘమాల, మంచు ధార కమ్మేసి, ఆహ్లాదం పంచుతోంది.–తిరుమల

శైవక్షేత్రదర్శిని



తిరుపతి అర్బన్: శైవక్షేత్రదర్శిని పేరుతో ఈ నెల 15, 18, 25 తేదీల్లో జిల్లాలోని శివాలయాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్లు మంగళం డీఎం భాస్కరరావు తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండింది. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆపదొచ్చింది రొయ్యో!

నకిలీ మందులు.. విత్తనం.. పెరిగిన ఉత్పాదక వ్యయం.. తగ్గిన ఎగుమతులు.. ఉత్పత్తుల పతనం.. అధఃపాతాళంలోకి ధరలు.. కొరవడిన కూటమి సర్కారు ప్రోత్సాహం.. వెరసి.. రొయ్య సాగు సంక్షోభంలో చిక్కుకుంది. దీనిపై ఆధారపడిన ఆక్వా రైతులకు నష్టాలు..కష్టాలే మిగిలాయి. ఫలితంగా రొయ్య చెరువులు వరి పొలాలుగా మారుతున్నాయి. కర్షకులు కునారిల్లుతున్నారు. ఇదీ నేడు ఆక్వా రైతుల దుస్థితి.

- జిల్లాలో కుంటుపడుతున్న ఆక్వా సాగు
- యూరోపియన్ దేశాలకు తగ్గిన ఎగుమతులు
- బయట వ్యాపారులను రానివ్వని సిండికేట్లు
- తీవ్ర నష్టాల్లో ఆక్వా రైతులు
- ఐదారు నెలలుగా ఇదే పరిస్థితి
- 60 శాతం తిరిగి వ్యవసాయంలోకి చేరిన వైనం



ట్రక్కులోకి రొయ్యలు లోడ్ చేస్తున్న కూలీలు

వాకాడు: రొయ్య రైతుకు కష్ట కాలం దాపురించింది. ఆరుగాలం శ్రమించినా ఫలితం లేకుండా పోతోంది. గత ఏడాది చివరి వరకు అంతోఇంతో లాభాలు రుచి చూపించిన ఆక్వా సాగు గత కొన్ని నెలలుగా నిలువునా ముంచేస్తోంది. గడిచిన ఆరు నెలల కాలంలోనే రొయ్యల సాగు అర్ధంతరంగా ముగిసిపోయింది. రొయ్యల చెరువులు తిరిగి వరి సాగులోకి మారుతున్నాయి. ప్రస్తుతం పెరిగిన ధరలతో పాటు నకిలీ మందులు, రొయ్య పిల్లలు రైతు కొంప ముంచుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రకృతి వైపరీత్యాల కారణంగా రొయ్య ఉత్పత్తులు భారీగా తగ్గుతున్నాయి. సాగులో పెరుగుతున్న ఉత్పాదక వ్యయం, భారీగా పతనమైన రొయ్య ధరలు వెరసి ఆక్వా రైతులను నట్టేట ముంచేస్తున్నాయి.

మార్చి, ఏప్రిల్‌లో మార్కెట్‌లో రొయ్యల ధర

ప్రస్తుతం కిలోధర రూ		6 నెలల కిందట ధర రూ	
40కౌంటు	380	40 కౌంటు	410
50కౌంటు	350	50కౌంటు	380
60కౌంటు	330	60కౌంటు	350
70కౌంటు	310	70కౌంటు	330
80కౌంటు	270	80 కౌంటు	310
90కౌంటు	260	90 కౌంటు	290
100కౌంటు	250	100కౌంటు	270



రొయ్యల చెరువులో పనిచేస్తున్న కూలీలు



రొయ్యలు పడుతున్న కూలీలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆక్వా రైతు వాకాడు మండలం, కల్లూరు పల్లిపాళెం గ్రామానికి చెందిన పాకం చెంగయ్య. ఈయన పిట్టి వానిపల్లి గ్రామం వద్ద దాదాపు 15 ఏళ్లుగా 10 ఎకరాల్లో రొయ్యల సాగు చేపడుతున్నాడు. సరిగ్గా పదేళ్ల కిందట ఆక్వా సాగులో భారీ ఆదాయం కళ్లజూశాడు. ఎటు చూసినా డబ్బే. దీంతో పలువురికి ఉపాధి కల్పించాడు. పేదోళ్లకు సహాయ సహకారాలు అందించాడు. క్రమేణ ఆక్వా సాగులో నకిలీలు రావడం, రొయ్య పిల్లలు ఎదుగుదల లేకపోవడం, ధరలు తగ్గిపోవడంతో నష్టాల బాట పట్టాడు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా సాగును కొనసాగించాడు. గత ఏడాది సాగులో నష్టాలు రావడంతో సాగుకు దూరమయ్యాడు. సాగు చేస్తున్న చెరువులకు లీజు కట్టలేక, కరెంటు బిల్లు చెల్లించలేక సాగును పూర్తిగా వదిలేశాడు. ప్రస్తుతం ఈయన సిద్ధి గుంటపాళెం గ్రామంలో బీడీ కొట్టు పెట్టుకుని తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

తగ్గుతున్న ఎగుమతులు

ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి గతంలో ఒక క్రాపులో టన్ను రొయ్యలు యూరోపియన్ దేశాలకు ఎగుమతి జరిగేది. నేడు సాగులో ఎదురయ్యే అనర్థాల కారణంగా రొయ్య ఎగుమతులు బాగా తగ్గిపోయాయి. 2020లో ఆక్వా రంగం నిలదొక్కుకునే విధంగా గత ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారించింది. కరోనా సమయంలో ఇతర దేశాలకు ఎగుమతులు జరిగేలా చర్యలు చేపట్టింది. నేడు ఆ పరిస్థితులు లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

60 శాతం మంది ఆక్వాకు దూరం

జిల్లా తీరం వెంబడి 9 మండలాల్లో దాదాపు 35 వేల ఎకరాల విస్తీర్ణంలో 19 వేల మందికి పైగా ఆక్వా రైతులు రొయ్యల సాగు చేపడుతున్నారు. ఆక్వా రైతుల నుంచి దాదాపు 6 వేల కోట్ల ఆదాయం వచ్చేది. అయితే రొయ్యల ధరలు పతనావ్యవస్థకు చేరుకోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో మాత్రమే రొయ్యల సాగవుతోంది. అందులో అరకొరగా దిగుబడులు వచ్చినప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అందినకాడికి దోసుకుపోతున్నారు. ఏడాదికి రెండు క్రాప్‌ల్లో రైతులు రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు. అందులో మొదటి క్రాపులో 1.75 లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తారు. రెండో క్రాప్‌లో లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో సాధారణ ధరలతో పోల్చుకుంటే 6 నెలల్లోనే జిల్లా రైతులు రూ.వందల కోట్లు నష్టపోతున్నారు. ఇక్కడ పండించిన రొయ్యలు 90 శాతం వరకు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేవి. గత ఆరు నెలలుగా ఆక్వా సాగులో నష్టాలు రావడంతో దాదాపు 60 శాతం మంది రైతులు సాగుకు దూరమయ్యారు. రొయ్యల వ్యాపారులు బయట ప్రాంతాల నుంచి రొయ్య కొనుగోలుదారులను రానివ్వకుండా సిండికేట్ దారులు అడ్డుకుంటున్నారు. పండించిన రొయ్య సంపదకు ధరలు లేక.. స్టోరేజ్ చేసుకునే వెసులుబాటు లేక రైతులు తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్నారు. దీంతో ఒక్కో ఎక్టారుకు లక్ష వరకు రైతులు నష్టపోతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

పెట్టుబడి అధికం

సాధారణంగా ఒక హెక్టారు విస్తీర్ణంలో రొయ్యలు సాగు చేయాలంటే దాదాపు రూ.4.7 లక్షల వరకు ఖర్చుచేయాలి.లక్ష రొయ్య పిల్లలు, ట్రాన్స్‌పోర్టుతో కలిపి రూ.70 వేలు, రొయ్యల మేత 1,800 కిలోలకు రూ.1.5 లక్షలు, కరెంటు బిల్లులు రూ.30 వేలు, కెమికల్స్ రూ.45 వేలు, చెరువుకు లీజు రూ.1.5 లక్షలు, కాపలా, ఫీడ్ బాయ్స్, ల్యాబ్ పరీక్షలు, తదితరాలు రూ.25 వేలు అవుతుంది. క్రాపు బాగా వచ్చి, మంచి ధర పలికితే హెక్టారుకు 1,300 కిలోల దిగుబడి రావొచ్చు. ఈ లెక్కన సుమారు రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షలు వచ్చేది. కాని ప్రస్తుత ధరలతో హెక్టారుకు రూ.లక్ష మేర నష్టం వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న శ్రీకాళహస్తి ఆలయ ఈఓ బసిరెడ్డి

తిరుపతి అర్బన్/శ్రీకాళహస్తి: భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ బసిరెడ్డిని ఆదేశించారు. వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. భక్తులతో ఆలయ ఉద్యోగులు గౌరవంగా వ్యవహరించాల్సి ఉందని చెప్పారు. దేశ విదేశాల నుంచి భక్తులు రాహుకేతు పూజలు చేయించుకోవడానికి శ్రీకాళహస్తికి వస్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిబంధనల ప్రకారమే భక్తులకు రాహుకేతు పూజ టికెట్లు, సామగ్రి ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ ఈఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన టి.బాపిరెడ్డి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూలమొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈఓకు పలు సూచనలు చేశారు.

17న జిల్లా స్థాయి చెస్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నాయుడుపేటలో అండర్–13 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస సూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 2011 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98852 38474 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

16 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ

–ఎమ్మార్‌పల్లి బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ

తిరుపతి అర్బన్: నగరంలోని ఎమ్మార్‌పల్లెలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ ఇస్తామని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. బీసీ వెల్ఫేర్ నేతృత్వంలో 220 మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీలు 200 మంది, ఈబీసీలు, ఈడబ్ల్యూఎస్ ఉన్నవారు 20 మంది ఉన్నారని స్పష్టం చేశారు. 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఫండ్‌తోపాటు స్టడీమెటీరియల్ అందిస్తామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల టెట్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో అందులో క్వాలిఫై అయిన బీఈడీ, డీఎడ్ విద్యార్థులు వారి సర్టిఫికెట్లతో ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకుంటే వారికి ఉచిత శిక్షణలో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఎమ్మారపల్లిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలని వెల్లడించారు. అదనపు సమాచారం కోసం 94414 56039, 99850 22254, 93462 21553 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధికారుల నేతృత్వంలో చేపట్టాల్సిన డీఎస్సీ ఉచిత కోచింగ్ తేదీల్లో స్పష్టత రాలేదు. ఉభయగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత తేదీలను ప్రకటిస్తామని ఆ విభాగానికి చెందిన అధికారులు వెల్లడించారు.

ఇరకం విద్యార్థులకు ఊరట



తడ: మండలంలోని ఇరకం దీవి నుంచి బయటి గ్రామాల్లోని పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల సౌకర్యార్థం రెండు మోటార్ బోట్ల కొనుగోలుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నిధులు మంజూరు చేశారు. పాత బోట్లపై ఇరకం దీవి నుంచి బీపీపాళెం పాఠశాలకు 40 మంది విద్యార్థులు, తమిళనాడులోని ఆరంబాకం, సున్నాంబుకుళం గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు వంద మంది వరకు విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఆ బోట్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే సమయంలో, తిరిగి గ్రామానికి చేరుకునే సమయాల్లో బోట్లు పులికాట్ సరస్సు మధ్యలో చిక్కుకోవడం, ప్రయాణం ఆలస్యం కావడంతో అటు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తరచూ ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న అవస్థల గురించి స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో విద్యార్థుల ప్రయాణం కోసం రెండు బోట్లకు కొత్త ఇంజిన్లు సమకూర్చుకునేందుకు నిధులు మంజూరు చేశారు. అడిగిన వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విద్యార్థులతోపాటు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై జిల్లా నెడ్ క్యాప్ మేనేజర్ దిలీప్‌కుమార్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేంద్రనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, నాబార్డు అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగం కాలుష్య రహితమన్నారు. పర్యావరణ హిత ఇంధన వినియోగం కోసం సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచి, వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సౌర విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకం జిల్లాలో అమలు పరచడానికి ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్‌గా, సభ్యులుగా జెడ్పీ సీఈఓ, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్, జిల్లా నెడ్‌క్యాప్ అధికారి, ఇతర సిబ్బందితో కూడిన ఏడుగురుతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 5 వేల మంది జనాభా కలిగిన గ్రామాలను గుర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవిని ఆదేశించారు. ఈ నెల 19వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గ్రామాలను ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా ఇంటిపై భాగంలో సౌర విద్యుత్ తయారు చేసుకుని,వినియోగించుకునేందుకు అవసరమైన పరికరాలను కేంద్ర ప్రభుత్వం రాయితీతో ఇస్తుందన్నారు. అందుకు ఆసక్తి గలవారు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, 3 కిలో వాట్‌లు, ఆ పైన యూనిట్లకు రూ.78 వేల రాయితీ వినియోగదారుని ఖాతాలో నేరుగా జమ అవుతుందన్నారు. 100 కిలోవాట్లు పైబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు అమర్చడానికి సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. మోడల్ సోలార్ విలేజ్ కోసం 5 వేలు జనాభా కలిగిన 5 గ్రామాలను గుర్తించి, వాటిని సో లార్ గ్రామాలుగా తీర్చి సిద్దేందుకు చర్య లు తీసుకోవాలన్నా రు. జిల్లాలో ఇప్పటికే 122 ప్రభుత్వ కా ర్యాలయాలను గుర్తించామని నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ కలెక్టర్‌కు తెలిపారు.

స్నేహపూర్వకంగా స్క్రీనింగ్ పరీక్షలు

తిరుపతి తుడా: జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి నిర్మూలించడానికి వైద్యాధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం స్విమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సునీత, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీహరితో క్యాన్సర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి వివిధ రకాల పరీక్షల నిర్వహించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు.

13 మంది ఎర్ర స్మగ్లర్లు అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : శేషాచల అడవుల్లోకి చొరబడుతున్న 13 మంది ఎర్ర స్మగ్లర్లను మంగళవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి తెలిపారు. వారి నుంచి రంపాలు, గొడ్డళ్లతో పాటు రెండు ఆటోలు, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐ కథనం మేరకు.. టాస్క్ ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ జి.బాలిరెడ్డి సూచనల మేరకు ఆర్ఐ(ఆపరేషన్స్) కే. సురేష్ కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు కేవీఎస్ కే.లింగాధర్, వై.విశ్వనాథ్, స్థానిక అటవీ శాఖ ఎఫ్‌బీఓ పీ.శ్రీదేవి బృందం చిత్తూరు జిల్లా ఐరాల అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ నిషేధిత అటవీ ప్రాంతంలో అడవిలోకి చొరబడేందుకు రెండు ఆటోలు, ఒక మోటారు సైకిల్‌పై కొంత మంది వ్యక్తులు దిగారు. వారిని టాస్క్ ఫోర్సు సిబ్బంది చుట్టుముట్టడంతో కొందరు పారిపోగా, 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 పిడి లేని ఇనుప గొడ్డళ్లు, బాడిశా, రంపపు చుట్టలు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. వారిలో 10 మంది తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వారు కాగా, మరొకరు కళ్లకురిచ్చి జిల్లాకు చెందిన వ్యక్తి, మరో ఇద్దరు చిత్తూరు పట్టణానికి చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ రెవెన్యూ, ఫారెస్ట్ భూములు ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్ తోపాటు ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారైన చర్యలు తీసుకోవాలన్నారు. కేవీబీ పురం మండలంలోని కళత్తూరులో 30 ఎకరాల అటవీ భూములను రైతులు ఆక్రమించి వ్యవసాయం చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఇప్పుడే స్వాధీనం చేసుకుంటే రైతులకు పంట నష్టం జరుగుతుందని వదిలిపెట్టామని చెప్పారు. రైతులు మాత్రం తాము మూడు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. రైతులు అందుకు రుజువులు చూపించాలని కోరారు. ప్రభుత్వ భూములపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు,కళత్తూరు రైతులు పాల్గొన్నారు.


పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ కుమార్

పుత్తూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తిరుపతి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడు తమవంతు కృషి చేయాలని డీఈఓ కెవీఎస్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ నూతన పాఠ్య పుస్తకంలోని కఠిన అంశాలను అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ప్రశ్నపత్రాల్లో వచ్చిన మార్పుల గురించి వివరిస్తూ, విద్యార్థుల మార్కుల ఉన్నతికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు అన్ని పాఠ్యాంశాల ఉపాధ్యాయులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. ఇందుకు తగ్గ కార్యాచరణను ప్రధానోపాధ్యాయులు రూపొందించుకోవాలని ఆదేశించారు. అనంతరం బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం, హాజరు శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భువనేశ్వరి, పుత్తూరు డివిజన్ పరిధిలోని హిందీ టీచర్లు పాల్గొన్నారు.

వైద్యరంగంలో అత్యవసర వైద్యం కీలకం



కార్యక్రమానికి హాజరైన స్విమ్స్ అధికారులు

తిరుపతి తుడా: వైద్యరంగంలో అత్యవసర వైద్య విభాగందే కీలక పాత్రతోపాటు సవాళ్లతో కూడుకున్నదని స్విమ్స్ డైరెక్టర్, వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్విమ్స్ ఎమెర్జెన్సీ విభాగం ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోగి పరిస్థితిని పరిశీలించి సరైన చికిత్స అందించడంలో ఎమెర్జెన్సీ వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నిరంతర వైద్యసేవలు అందిస్తూ స్విమ్స్ ఎమర్జెన్సీ విభాగం సేవలను అత్యున్నత స్థాయిలో అందిస్తూ ఆస్పత్రి పేరుప్రతిష్టలను ఉన్నత స్థాయికి చేర్చడంలో డాక్టర్ల సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ సింహారెడ్డి, డాక్టర్ ప్రకాష్‌బాబు, డాక్టర్ పాండ్య, డాక్టర్ అమీర్‌రషీద్, డాక్టర్ రోహిత్ గుప్తా, వైద్యులు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ అపార్ ఐడీ అవసరం



ముఖ్య అతిథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళ

తిరుపతి సిటీ: ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీని సృష్టించాల్సి అవసరం ఉందని ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా రాష్ట్ర ఉన్నత విద్య, కేంద్ర ఎలక్ట్రానిక్ అండ్ ఇన్‌ఫర్మేషన్ మినిస్ట్రీ డిజిటల్ ఇండియా కార్పొరేషన్, ఎన్ఏడీ డిజీ లాకర్ సంయుక్తంగా ఆధ్వర్యంలో మంగళవారం అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, అపార్ ఐడీ క్రియేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించి, ప్రసంగించారు. జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం అకాడమీ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌లో ప్రతి విద్యార్థికి అపార్ ఐడీని సృష్టించాల్సి అవసరం ఉందన్నారు. ఇందులో విద్యార్థుల సాధించిన క్రెడిట్స్, మార్కుల జాబితా, డిగ్రీ పట్టాలు డిజిటల్ రూపంలో విద్యా సంస్థలు ద్వారా నిల్వ ఉంచాలన్నారు. ఇందుకోసం విద్యార్థులు ఆధార్ కార్డు ద్వారా వారి ఐడీని క్రియేట్ చేసుకోవాలన్నారు. అనంతరం డిజిటల్ ఇండియా జాతీయ కోఆర్డినేటర్ గౌరవ్ కరే మాట్లాడుతూ ప్రతి వర్సిటీ ఆపార్ క్రియేషన్‌ను బాధ్యతగా నిర్వహించాలన్నారు. డిజిటల్ ఇండియా కార్పొరేషన్ జోనల్ కోఆర్డినేటర్ రవి పాండే, డీన్ ఎస్సీ రాయుడు, అఖిల స్వతంత్ర, డాక్టర్ అరుణ జ్యోతి, రాయలసీమ పరిధిలోని వివిధ వర్సిటీల, ప్రధాన కళాశాలల కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.